మొండి చెయ్యి.. తొండి నోరు

మొదటిపేజీ తరువాయి...

ప్రొసీడింగ్స్ ఇచ్చామని, ఆ పథకాన్ని రద్దు చేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సదరు లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో వీరికి న్యాయం చేయాలని సూచించారు. దళిత బంధు సాయాన్ని పెంచుతామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్.. ఆ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తున్నదని ఆరోపించారు. డిసెంబర్ 9 నుంచి రైతుబంధు, రైతు రుణ మాఫీ చెస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వానాకాలం పంట కొనుగోలు చేయడమే కాకుండా ఎకరానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోలేదని గుర్తు చేశారు. సీఎం హోదాలో ఉన్న ఏ నాయకుడైనా మాట్లాడితే అది ప్రభుత్వ ఉత్తర్వుతో సమానమని చెప్పారు. అలాంటిది సీఎం రేవంత్ మాట మార్చటం ఏ విధమైన సంకేతాలు ఇస్తుందని ప్రశ్నించారు. సీఎం రేవంత్ మొదట ఫార్మాసిటీని ఎత్తేస్తున్నామని చెప్పి తెల్లారే మాట మార్చారని, మెట్రో రైల్ అలైన్‌మెంట్ మారుస్తామని ఆ తరువాత మార్చమని చెప్పడంలో ఆంతర్యం ఏమిటనీ నిలదీశారు. అదానీ పనైపోయింది, ఇక ప్రధాని పనే మిగిలిందని నాగపూర్ కాంగ్రెస్ సమావేశంలో చెప్పిన సీఎం రేవంత్.. హైదరాబాద్‌లో అదానీకి రెడ్ కార్పెట్ పరిచారని.. దీనిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో రెండు అమలు చేశామంటూ పెద్ద పెద్ద పత్రికా ప్రకటనలు ఇచ్చి ప్రజాధనం దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతకు యువవికాసం కింద భృతి రూ.4,000 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. అసెంబ్లీ సాక్షిగా మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఆర్థిక శాఖ మంత్రి అసెంబ్లీ సాక్షిగా తాము నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదని మాట మార్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అంటేనే మొండి చెయ్యి.. తొండినోరు అని ఆగ్రహించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చార్‌సౌబీస్ అని తాము అనలేదని, ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలే 420 అని గుర్తుచేశారు.

రైతుబంధు పైసలు రాఘవ కన్‌స్ట్రక్షన్‌లోకి వెళ్లాయా?: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేసేందుకు సిద్ధం చేసిన రైతుబంధు సొమ్ము రూ.7,700 కోట్లు రాఘవ కన్‌స్ట్రక్షన్ ఖాతాలోకి వెళ్లాయా? అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. రైతుబంధు కోసం సిద్ధంచేసిన పైసలు ఏ కాంట్రాక్ట్ సంస్థలకు వెళ్లాయని నిలదీశారు. రైతుల ఖాతాల్లోకి వెళ్లకుండా ఆ సొమ్ము ఎక్కడికిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లటం కప్పం కట్టడమే పాలనగా సాగిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై పనిగట్టుకొని కాంగ్రెస్ చేస్తున్న దాడులను ఎండగడతామని చెప్పారు. కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాల వల్ల ఆటోడ్రైవర్ సతీశ్ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఉదహరించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు దిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సింగరేణి క్వార్టర్లలో తామెవరినీ ఖాళీ చేయించలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయిస్తున్నదని చెప్పారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగుతున్నది ప్రజాపాలన కాదని, దరిద్రపు పాలనని, నియంతృత్వ ఫాసిస్ట్ పోకడలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ భానుప్రసాదరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామని స్పష్టంచేశారు.

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, భానుప్రసాదరావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పార్టీ నేతలు నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సతీశ్ తదితరులు

ఫిబ్రవరిలో ప్రజల్లోకి కేసీఆర్

- వచ్చే నెలనుంచి తెలంగాణ భవన్‌లో ప్రతి కార్యకర్తనూ కలుస్తారు
- త్వరలోనే కేసీఆర్ జిల్లాల పర్యటన
- గులాబీ కార్యకర్తలకు అండగా ఉంటాం
- కాంగ్రెస్ కక్షసాధింపు ఎదుర్కొంటాం
- ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదు
- పార్టీ సంస్థాగత నిర్మాణం చేస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కోలుకుంటున్నారని, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యవంతుడై ప్రజల మధ్యలోకి వస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. ఫిబ్రవరిలో తెలంగాణ భవన్‌కు వచ్చి ప్రతీరోజూ పార్టీ కార్యకర్తలను కలుస్తారని తెలిపారు. త్వరలోనే కేసీఆర్ జిల్లాల పర్యటనలు ఉంటాయని పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన పథకాలను రద్దు చేసినంత మాత్రాన, పేర్లు మార్చినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పాలన కాదనలేనిదని అన్నారు. కిట్ మీద కేసీఆర్ గుర్తును కాంగ్రెస్ ప్రభుత్వం చెరిపేస్తుందని, కేసీఆర్ గుర్తును కేసీఆర్ కిట్ నుంచి తొలిగిస్తారేమో కానీ తెలంగాణ ప్రజల గుండెల నుంచి తొలగించలేరని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రద్దు.. వాయిదాలు అన్నట్టుగా సాగుతున్నదని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలు సహించం

కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టి, రౌడీషీట్లు ఓపెన్‌చేసి భయభ్రాంతులకు గురిచేస్తే గులాబీ సైన్యం బెదరదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ విపరీత చర్యలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగితే ఎమ్మెల్యేలమంతా బస్సు కట్టుకొని వాలిపోతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆగడాలపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. కార్యకర్తలు, నాయకులను పార్టీ కంటికిరెప్పలా కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ కోసం ఉద్యమంలో రాజీనామాలు చేశామే కానీ రాజీ పడలేదని అన్నారు. కేసులు, జైళ్లు తమకు కొత్తకాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు చూస్తుంటే ఏడాది తిరగకముందే ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందని తెలిసిపోతున్నదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, పాలనపై కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం, పార్టీలో అక్కడక్కడా జరిగిన చిన్నచిన్న పొరపాట్ల వల్ల ఓడిపోయామని పేర్కొన్నారు. అన్నిస్థాయిల పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వచ్చిన సూచనలకు అనుగుణంగా త్వరలో పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తొలి సారి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నదని, ప్రజలు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా వ్యవహరించి ప్రజల పక్షాన నిలబడుతామని తెలిపారు. పెద్దపల్లితోపాటు రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందేందుకు సమష్టి కృషి, సమన్వయంతో ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులెవరూ అధైర్య పడొద్దని, త్వరలో మంచిరోజులు వస్తాయని చెప్పారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పార్టీ నడుస్తుందని చెప్పారు. సమావేశంలో పార్టీ సెక్రటరీ జనరల్, బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, బోడ జనార్దన్, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కోరుకంటి చందర్‌సహా జిల్లా పరిషత్తు చైర్మన్లు, చైర్మన్లు, మాజీ చైర్మన్లు, పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడితే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా?: నిరంజన్‌రెడ్డి

అధైర్యపడితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఆ మాటకొస్తే ప్రపంచంలోనే పార్లమెంటరీ వ్యవస్థలో ఓడిపోని రాజకీయ పార్టీ లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా పరిపాలన సాగించాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో పార్టీని అంతగా పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని చెప్పారు. జరిగిన నష్టానికి కారణాలు విశ్లేషిస్తూనే భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడంలో స్థితప్రజ్ఞత చూపాల్సిన అవసరం ఉన్నదని, పార్టీ శ్రేణులు అందుకు అనుగుణంగా ఉండాలని సూచించారు.

ముురుగునీటి శుద్ధిలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): దేశంలోనే వందకు వంద శాతం మురుగునీటిని శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. ఇటువంటి బృహత్తర విధానాన్ని కేసీఆర్ ప్రభుత్వం చేపట్టినందుకు గర్వంగా ఉన్నదని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు ప్యాకేజీల్లో రూ.3,866.41 కోట్లతో నిర్మిస్తున్న 31 ఎస్టీపీలు విడతలవారీగా అందుబాటులోకి వస్తుండగా.. నిర్మాణ పనులను మెగా ఇంజినీరింగ్ కంపెనీ గురువారం 'ఎక్స్'(ట్విట్టర్) వేదికగా షేర్ చేయగా.. దీనిపై కేటీఆర్ స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి దిశగా చేపట్టిన ప్రయాణంలో ఇదో గొప్ప భాగమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని ఆశిస్తున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు.

కర్ణాటక వర్సిటీల్లో ఫీజుల మోత: క్రిశాంక్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): 'యువనిధి' అంటూ కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్టేట్ వర్సిటీల్లో అన్ని రకాల ఫీజులను గణనీయంగా పెంచనున్నది. ఏటా 10 శాతం పెంచనుండగా, ప్రతి రెండేండ్లకు 20-25 శాతం పెంచేందుకు నిర్ణయించింది. స్టేట్ వర్సిటీల్లో ఫీజుల పెంపునకు నియమించిన నిపుణుల కమిటీ సిఫారసులను కర్ణాటక విద్యాశాఖ తాజాగా ఆమోదించింది. దీని ప్రకారం యూజీ, పీజీ కోర్సుల్లో అప్లికేషన్, ట్యూషన్, ఎగ్జామ్స్, ఇన్విజిలేటర్ల రెమ్యునరేషన్లను భారీగా పెంచారు. ఈ ఫీజులను అమలుచేయాలని కర్ణాటక ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ డాక్టర్ వైఎస్ సిద్దేగౌడ రాష్ట్రంలోని 32 యూనివర్సిటీలకు సూచించారు. దీనిపై బీఆర్ఎస్ యువనేత క్రిశాంక్ సోషల్ మీడియాలో స్పందించారు. యువనిధి గ్యారెంటీ పథకాన్ని గుర్తుచేసిన ఆయన 'మీ జేబులో నుంచి 10 తీసుకుని, ఒకటి ఇవ్వడమేనా? యువనిధి' అని కర్ణాటక యువతను ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ స్థానాలకు రెండు ఎన్నికలెందుకు?

- వేర్వేరు నోటిఫికేషన్లు ఎందుకు?
- కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చేందుకేనా?
- ఈసీని నిలదీసిన బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఒకే ఎన్నిక నిర్వహించకుండా రెండు ఎన్నికలు నిర్వహించడంలో ఆంతర్యమేమిటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి తమ ఎమ్మెల్సీ స్థానాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరి స్థానాలను భర్తీ చేయడానికి ఎన్నికల సంఘం రెండు వేర్వేరు నోటిఫికేషన్లు ఇవ్వడం ఎందుకని ఒక ప్రకటనలో నిలదీశారు. గతంలో 2021 నవంబర్ 9న ఒకే నోటిఫికేషన్ ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో కడియం శ్రీహరి, కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ లీగల్ సెల్‌తో చర్చించి ఎన్నికల అధికారులకు లేఖ రాయనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే ఈసీ కుయుక్తి పన్నిట్టు అర్థమవుతున్నదని ఆరోపించారు.

బీఆర్ఎస్‌ది చారిత్రక పాత్ర: మాజీ స్పీకర్ సిరికొండ

బీఆర్ఎస్ పార్టీది చారిత్రకపాత్ర అని మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ పుట్టిన నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు లాంటి బలమైన నాయకులను కేసీఆర్ ఎదుర్కొని తెలంగాణ వాదాన్ని ద్విగుణీకృతం చేశారని వివరించారు. తెలంగాణ వస్తదో? రాదో? అనే సంశయంతో పార్టీలో చేరేందుకే ముందుకురాని వాతావరణం ఆనాడు ఉండేదని, అలాంటిది కేసీఆర్ దార్శనికత, వ్యూహ చతురత, సుదీర్ఘపోరాటం ఫలితంగా రాష్ట్రాన్ని సాధించి, సాధించిన తెలంగాణను దేశానికే మార్గదర్శనం చేశామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టకపోవచ్చుకానీ తెలంగాణ ప్రజల టార్చ్ బేరర్‌గా కొనసాగుతుందని తెలిపారు.

చలి తీవ్రత.. కనిపించని మామిడి పూత

- సాధారణంగా అక్టోబర్ నెలలోనే మామిడి పూత సీజన్ ప్రారంభం
- డిసెంబర్ నాటికే తోటల పిందెదశ
- జనవరి వచ్చినా కనిపించని పూత
- వాతావరణంలో వచ్చిన మార్పులే కారణమంటున్న శాస్త్రవేత్తలు
- ఆందోళనలో మామిడి రైతులు

వరంగల్, జనవరి 6 (నమస్తే తెలంగాణప్రతినిధి): వాతావరణ పరిస్థితులు అన్నీ అనుకూలిస్తే.. మామిడి చెట్లు శివరాత్రి వరకే శివలింగమంత సైజులో ఉండే కాయలు కాస్తాయి. అక్టోబర్‌లోనే మామిడి సీజన్ ప్రారంభమై డిసెంబర్ చివరి నాటికి తోటలు 90 శాతం పూత పూసి మామిడి పంట పిందె దశకు చేరుకుంటుంది. అలాంటిది.. ఈ సారి జనవరి మొదటి వారం దాటినా పూత పూయలేదు. ఫలితంగా తోటల్లోని చెట్లు మొండిగా దర్శనమిస్తున్నాయి. ఇందుకు వాతావరణ మార్పులు, అధికమైన చలి తీవ్రతే కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. ఈ సారి మామిడి పంట దిగుబడులు లేనట్టేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. మామిడి పండ్లతో కోట్లల్లో వ్యాపారం నిర్వహించే పండ్ల వ్యాపారులు, మామిడి పండ్లను ఆస్వాదించే ప్రియులు నిరాశ చెందుతున్నారు.

మామిడి రైతుల ఆందోళన

వాతావరణంలో ప్రతికూల మార్పుల కారణంగా ఈ సీజన్‌లో మామిడి తోటలకు ఇప్పటికీ పూత రాలేదు. చల్లని వాతావరణం, మంచు కురుస్తుండటంతో ఇప్పట్లో పూత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. డిసెంబర్‌లోపే పిందెలు పట్టాల్సిన తోటలు.. ఇంకా పూత పట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. మామిడి పూసేందుకు జనవరి ఆఖరి వరకు అదును ఉన్నా.. ఆలస్యంగా పూత వస్తే పంట దిగుబడి తగ్గుతుందని రైతులు చెప్తున్నారు. అలాగే.. కాయలు లేటుగా కాసి.. వానకాలం మొదలైన తర్వాత పండు దశకు వస్తాయని, మే నెలలో గాలివానలతో పంట చేతికి రాకుండాపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్నిబట్టి ప్రస్తుత సీజన్‌లో మామిడి తోటల పరిస్థితి ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరిలో చలి తీవ్రత ఉన్నా.. రాత్రి, పగలు ఉష్ణోగ్రతల మధ్య తేడా ఎక్కువగా ఉంటుంది. రాత్రి బాగా చలి, మధ్యాహ్నం ఎండ ఎక్కువ ఉంటుంది. ప్రస్తుత సీజన్‌లో రాత్రి తీవ్రమైన చలితోపాటు పగలు కూడా చలి ప్రభావం ఉంటున్నది. వేడి వాతావరణం ఉండటం లేదు. రాత్రి, పగటి ఉష్ణోగ్రతలలో తేడా ఎక్కువగా ఉన్నప్పుడే మామిడి పూతకు అనుకూల వాతావరణం ఉంటుంది. ఇప్పుడు రాత్రి, పగలు చలి వాతావరణం ఎక్కువగా ఉండటంతో మామిడి చెట్లలో పూత ప్రక్రియ కనిపించడం లేదని వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

మామిడి తోటలకు తెలంగాణ ప్రసిద్ధి

దేశంలో మామిడి తోటలకు తెలంగాణ ప్రసిద్ధి చెందింది. ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది. మొత్తం 2.90 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఏటా 10.23 లక్షల టన్నుల మామిడి పండ్లు ఉత్పత్తి అవుతాయి. తెలంగాణ మామిడి పండ్లకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండు ఉంది. ఏటా రాష్ట్రంలో మామిడి పండ్లతో రూ.1,535 కోట్ల వ్యాపారం జరుగుతున్నది. దేశ వ్యాప్తంగా ఎక్కువ డిమాండు ఉండే బంగినపల్లి వెరైటీ మామిడి పండ్ల తోటలు తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నాయి. ఎగుమతి, రవాణా, నాణ్యతకు అనుకూలమైన వెరైటీ ఇది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షణాఫ్రికా, కువైట్, ఇరాన్, మస్కట్, చెక్ రిపబ్లిక్, నైజీరియా, మలేషియా, సింగపూర్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు తెలంగాణ నుంచి మామిడి పండ్లు ఎగుమతి అవుతాయి. రాష్ట్రంలోని వేలాది మంది రైతులు నేరుగా ఢిల్లీ, ముంబై మార్కెట్లకు పంటను తీసుకుపోయి అమ్ముతారు. వ్యాపారులు కూడా రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేసి ఢిల్లీ, ముంబై, నాగ్‌పూర్, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు మార్కెట్లకు మామిడి పండ్లను ఎగుమతి చేస్తారు.

వాతావరణ మార్పులతోనే

వాతావరణంలోని మార్పులు అన్ని పంటలపైనా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో మామిడిపై దీని ప్రభావం ఎక్కువగా ఉన్నది. డిసెంబర్ మామిడి పూతకు మంచి సీజన్. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలో ఎక్కువగా తేడా ఉన్నప్పుడు మామిడి చెట్లలో అంతర్గతంగా ఒకరకమైన ఒత్తిడి కలిగి పూత ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఈ సారి పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో మామిడి పూత రావడం లేదు. జనవరి ఆఖరు వరకు మామిడి పూతకు అనువైన పరిస్థితి ఉంటుంది. మొగ్గలు వచ్చిన చెట్లకు, నేల స్వభావానికి అనుగుణంగా అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

-రావుల ఉమారెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం

అయ్యప్ప భక్తుల బస్సులో అగ్నిప్రమాదం

పథనంతిట్ట: శబరిమల అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్న బస్సు శనివారం ఉదయం అగ్నిప్రమాదానికి గురైంది. నిలక్కల్ నుంచి బయల్దేరిన కేఎస్ఆర్‌టీసీ బస్సు పంబ సమీపానికి చేరుకునేసరికి ఏదో సాంకేతిక లోపం వచ్చినట్లు డ్రైవర్, కండక్టర్ గుర్తించారు. బస్సు దిగి, ఇంజిన్‌ను చూడగా బస్సు నుంచి పొగ విరజిమ్మింది. మంటలు వ్యాపించాయి. భక్తులు హుటాహుటిన బస్సు నుంచి దిగిపోయారు. వీరిలో కొందరు గాయపడ్డారు.

రైల్లో చలి మంటలు.. ఇద్దరి అరెస్టు

న్యూఢిల్లీ: అస్సాం నుంచి ఢిల్లీ వెళ్తున్న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఈ నెల 3న ఇద్దరు వ్యక్తులు చలి మంటలు వేశారు. యూపీలోని అలీగఢ్ జిల్లా, బర్హాన్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్రాసింగ్ వద్ద గేట్‌మ్యాన్ ఈ రైలులో మంటలు, పొగలను గమనించి రైల్వే అధికారులను అప్రమత్తం చేశారు. చమ్రౌలా రైల్వే స్టేషన్‌లో ఈ రైలును ఆపి సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అన్ని బోగీలను తనిఖీ చేశారు. జనరల్ బోగీలో 16 మంది చలి మంట వేసి చలి కాచుకుంటున్నట్లు గమనించి, వీరందరినీ అరెస్ట్ చేశారు. వీరిలో చందన్ (23), దేవేంద్ర (23) ఇది తమ పనేనని ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు. మిగిలిన వారిని హెచ్చరించి వదిలేశారు.

సొంత రాబడుల్లో తెలంగాణ టాప్

- రూ.30,914 తలసరితో అగ్రస్థానం
- కేసీఆర్ ప్రభుత్వ సంస్కరణలే కారణం
- రెండో స్థానంలో హర్యానా..
- గుజరాత్‌లో రూ.19,835 మాత్రమే

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): సొంత రాబడుల్లో తెలంగాణ మరోసారి సత్తా చాటింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.30,914 తలసరి సొంత రాబడితో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఉద్యమనేత కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతోనే ఇది సాధ్యమైంది. ఈ జాబితాలో బీజేపీ పాలిత రాష్ట్రాలన్నీ తెలంగాణ తర్వాతే ఉన్నాయి. రూ.29,082 తలసరి రాబడితో హర్యానా రెండో స్థానంలో నిలువగా.. ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ రూ.19,835తో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకున్నది. గుజరాత్ కంటే తెలంగాణ తలసరి రాబడి ఏకంగా రూ.11,079 ఎక్కువ. మోదీ ప్రాతినిధ్య రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కూడా తెలంగాణకు దరిదాపుల్లో లేదు. తలసరి సొంత రాబడుల్లో ఆ రాష్ట్రం 17వ స్థానానికి పరిమితమైంది.

2022-23లో రాష్ట్రాల సొంత రాబడులు (రూ.)

రాష్ట్రం	తలసరి
తెలంగాణ	30,914
హర్యానా	29,082
ఢిల్లీ	28,413
మహారాష్ట్ర	22,828
సిక్కిం	21,881
కేరళ	22,181
కర్ణాటక	20,768
తమిళనాడు	19,793
గుజరాత్	19,835
ఆంధ్రప్రదేశ్	18,359
పంజాబ్	16,432
హిమాచల్‌ప్రదేశ్	15,851
ఉత్తరాఖండ్	15,239
అరుణాచల్‌ప్రదేశ్	15,104
రాజస్థాన్	14,339
ఛత్తీస్‌గఢ్	11,352
ఉత్తరప్రదేశ్	11,043
ఒడిశా	10,959
మధ్యప్రదేశ్	10,032
బీహార్	3,976
మణిపూర్	9,337
పశ్చిమ బెంగాల్	8,693
మేఘాలయ	8,679
జార్ఖండ్	7,531
మిజోరం	7,300
అస్సాం	7,173
నాగాలాండ్	7,162
త్రిపుర	6,886

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహావేదిక అధ్యక్షుడు శ్రీనివాస్

ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చాలి

ముదిరాజ్ మహావేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్

ఖైరతాబాద్, జనవరి 6: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహావేదిక అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ కోరారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 లక్షలకు పైగా ముదిరాజ్ జనాభా ఉన్నదని, ఉద్యోగ నోటిఫికేషన్లు రాకముందే